# మా ఆవిడ సాహిత్య సేవ

"బాగులేదు" అని ఇచ్చేసింది మా ఆవిడ. నేను చదివి, మెచ్చుకుని తనని చదవమని ఇచ్చిన నవల; ఆఫీసునుంచి వచ్చేసరికి కాఫీ కన్నా ముందుగా.

"నీలాంటి వాళ్ళకి బావుంటే ఎంత, బావుండకపోతే ఎంత! ఆ నవల సీరియలైజ్ అయింది. సీరియల్‌గా నడుస్తున్నప్పుడు ఆ పత్రిక సర్క్యులేషన్ పదివేలకి పైగా పెరిగింది. తరవాత ఆ నవల పుస్తక రూపంలో వొచ్చింది. రెండేళ్ళలో మూడు ఎడిషన్లు పడింది. ఇప్పుడు సినిమా తీస్తున్నారు కూడాను!" అన్నాను కరుగ్గా.

"సినిమా రిలీజయ్యాక రెండు వందల రోజులో, రెండేళ్ళో ఆడుతుంది కాబోలు. ఆడనీండి, దానికీ దీనికీ సంబంధమేమిటి?" అంటూ ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో వంపి ఇచ్చింది. రోజూ నేను ఆఫీసునుంచి వచ్చేక కాఫీ తాజాగా తయారుచేసేది. ఇవ్వాళ ఈ నిలవ కాఫీ యేమిటని అడిగాను.

మధ్యాహ్నం రెండున్నరకే నవల పూర్తయిందిట. తలనొప్పి భరించలేక పక్క వీధిలో మందుల షాపుకెళ్ళి మాత్ర తెచ్చుకుని కాఫీ కలుపుకుందిట. ఆ గడబిడలో ఎక్కువ కలిపేసి నాకు ఫ్లాస్కులో వుంచిందట.

"అప్పట్నించీ నిద్రపోతున్నావు గావును."

"నేను నిద్రపోడంలేదు, నిద్రపోతున్న పాఠకులను మేల్కొలుపుతున్నాను!"

ఆ మాటా అర్థంకాలేదు నాకు. మళ్ళీ అడిగితే చెప్పింది, దేశంలో బోలెడు నిద్రాసాహిత్యం ఉత్పత్తి అవుతోందట. అది చదివి జనం పాడైపోతున్నారట. అంచేత జనాన్ని జాగృతుల్నిచేసే బృహత్కార్యక్రమాన్ని చేపట్టి కవితలు, కథలు రాయడానికి కంకణం కట్టుకున్నదట. ఈ నాలుగు గంటల్లోనే ఒక రచన చేసిందట.

ఆవిడ అభిప్రాయం విని మంటెత్తు కొచ్చినా, తను వూరికే కూర్చోకుండా రచనలు చేస్తే వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు సాయంగా ఆవిడ రచనలుమీద వచ్చే డబ్బు నాకొంత సుఖాన్ని ఇవ్వకపోతుందా అని చల్లారాను.

"ఏ పత్రిక్కి పంపుతావు?" అన్నాను చదివి.

"కొత్తగా వస్తోందిగా విభావరి. దానికి పంపుతాను!"

అవును రెండు నెలలై వస్తోంది. సాహిత్యంలో సరికొత్త రీతులకోసం నానా తపనా పడుతోంది విభావరి.

మా ఆవిడ రచన పంపడం; అది అందిందని; బావుందని; వేస్తున్నాం అని; వాళ్ళు ఉత్తరం రాయడం జరిగింది. మా ఆవిడ వెంటనే జాకెట్లన్నిటికీ కాలర్లు కుట్టించుకుని అవి ఎత్తుకుని (ఇంట్లోనే) తిరగడం మొదలెట్టింది.

అయితే ఆ పత్రిక మరుసటి సంచిక రానేలేదు. ఎవర్నో అడిగితే విభావరి ఆగిపోయిందన్నారు.

ఈ లోపుగా మా ఆవిడ మరో ఘాటైన రచన చేసింది. "ఈ మాటు దేనికి పంపుతావు?" అన్నాను.

"ఈ కొత్త పత్రికల్ని నమ్మడానికి లేదు. ఏదో పురిటినొప్పులు పడి రెండో మూడో ఇష్యూలు (సంచికలు) రావడం, చెప్పాపెట్టకండా

ఆగిపోడమున్న. సుఖం లేదు. అంచేత "నూతన"కి పంపుతాను, ఆరేళ్ళయి వస్తోందిగా !"

అంతే! ఆ మరుసటి నెలనుంచి 'నూతన' రాలే దెంచేతనా అని ఎదురు చూడ్డంతో సరిపోయింది.

అలాగే, మూడో రచన 'తోరణం' అనే పత్రిక్కి పంపింది. వాళ్ళు కూడా రచన అందిందని, బాగుందని, వేసుకుంటున్నామని ఉత్తరం రాసేరు. కాని, కారణం ఏమిటోగాని 'తోరణం' కూడా ఆగి పోయింది.

నాలుగో రచన మా ఆవిడ ఇంకా బాగా రాసి ఇంకా జాగ్రత్తగా ఆలోచించి, 'రాధిక' అనే పత్రిక్కి పంపింది. అదీ మంచి వనరులు గల పత్రిక. వాళ్ళకి ఒక దినపత్రిక, స్వంత ప్రెస్సు, బ్లాక్ మేకింగ్ యూనిట్టు; అన్నీ వున్నాయి. అయినా నేను లోపాయికారీగా రాధిక రా దిక అంటూ పై పందాలు కాశాను.

రాధిక, ఈవిడ రచన పంపిన రెండు నెలలదాకా వచ్చింది. కాని; ఎప్పుడైతే మరుసటి సంచికలో మీ రచన వేస్తున్నాం అని వాళ్ళు ఉత్తరం రాశారో అక్కడితో ఆ పత్రిక కూడా ఆగిపోయింది. వాళ్ళ దినపత్రికలో రాధిక రా దిక అని ప్రకటన వేశారు.

ఆరాత్రి మా ఆవిణ్ణి ఊరడించి సంబాళించుకోడం మహా కష్టమై పోయింది నాకు. అక్షరాలా ఉపవాసం అనుకోండి !

చివరికి నాకో ఉపాయం తట్టింది.

"అవునూ; నువ్వు రేడియో కెందుకు రాయకూడదు ?" అన్నాను. మా ఆవిడకి ప్రాణం, బలం కూడా వచ్చాయి యీ మాటకి. రాత్రంతా జాగ-"రూకత"తో రచన సాగించి, మర్నాడు ఫెయిర్ చేసి, స్వయంగా యివ్వడానికి బయలుదేరింది. మా పక్కింటాయన అల్లుడు రేడియో ఆఫీసులో పని చేస్తున్నాడు. అందుకని ఆయనతో చెప్పాను, ఏదో కాస్త చూసేటట్టు చెయ్యమని. ఆయన పరుగు పరుగున వచ్చి రిక్షాకి అడ్డం పడ్డాడు. "అమ్మా, అమ్మా ! ఈ ఒక్క

పనీ కాస్త ఆలోచించి చెయ్యండమ్మా; మనకి మరీ అంత ఎక్కువ సంఖ్యలో రేడియో స్టేషన్లు లేవు...." అంటూ. మా ఆవిడ ఆయన మాటల్ని చెవిని పెట్టలేదు.

రేడియోవారు ఆమె రచనని స్వీకరించారు. కాంట్రాక్ట్ ఇచ్చారు. ప్రోగ్రాం ఫలానా తేదీని ఫలానా కార్యక్రమం కింద రాత్రి ఎనిమిది గంటలకి ప్రసారం అవుతుందంటూ వాళ్ళ పత్రికలో అచ్చు వేసేరు. నేను సస్పెన్స్ సినిమా చూస్తున్నంతగా ఉత్కంఠలో మునిగిపోయాను.

చివరికి ఆరోజు వచ్చింది. ఆ రాత్రి కూడా వొచ్చేసింది........ చెప్పుకోదగ్గ సంఘటన లేమీ జరగలేదు. ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి గాని; ఏదో ఒక శక్తిమంతమైన స్వచ్ఛంద సంస్థగాని "మీ స్టేషన్ కార్యక్రమాలు ఏమీ బాగుండడం లేదు; ఫలానా తేదీనుంచి ఈ స్టేషన్ మూసెయ్యండి" అన్నలాంటి ఆర్డర్ వెయ్యలేదు....

మరికొన్ని నిమిషాల్లో మా ఆవిడ రచన ప్రసారం అవుతుంది.

అంతే! ఎక్కణ్ణుంచి వచ్చాయో, ఆకాశంనిండా ఘోర- కారు-మబ్బులు! పిడుగులు పడుతూ వర్షం ప్రారంభమైంది. కరెంటు పోయింది. సరిగ్గా పావుగంట పాటు అంధకారం!.... బేటరీతో పని చేసే ట్రాన్సిస్టర్ కూడా తుస్ తుస్ బుర్ బుర్ ఈఽ అంటూ కూర్చుంది.

పావుగంట తరవాత; ముందుగా లైట్లు వెలిగాయి. వెంటనే రేడియో గొంతు విప్పింది. "సాంకేతిక కారణాలవల్ల ఈ ప్రసారంలో 7.58 నుంచి 8.16 వరకు అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాం. తరువాతి కార్యక్రమం—" అంటూ.

"నేనింకేమీ రాయను. మీరు ఏది చెప్తే అదే చదివి మెచ్చుకుంటాను" అంది మా ఆవిడ; సమయ (మన) స్ఫూర్తిగా నా మీద వాలిపోతూ.

(10-3-79)

(మిత్రుడు ఆదూరి వెంకట సీతారామమూర్తికి కృతజ్ఞతలతో)